సాక్షి
వికారాబాద్

బుధవారం । 31 । జూలై । 2024



చట్టం ముందు సమానం

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం అన్నారు. 10లో▸



అక్రమ అరెస్టులతో..

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప అన్నారు. 10లో▸



సీఎం రైతు పక్షపాతి

సీఎం రేవంత్ రైతు పక్షపాతి అని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. 11లో▸

నేడు వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

వికారాబాద్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : వికారాబాద్
కమిషనర్ : జాకీర్ అహ్మద్
తేదీ : 31-7-2024 (బుధవారం)
సమయం : ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
9849905910, 9398227053

26,438 మంది
రూ.262 కోట్లు

రెండో విడతలో 26,438 మంది రైతులకు రూ.262.64 కోట్ల రుణాలు మాఫీ

- రూ.1.50 లక్షల వరకు రుణాలు పొందిన వారికి లబ్ధి
- చివరి విడతలో రూ.2 లక్షల వారికి..
- జిల్లాలో రైతులు 2.50లక్షలు
- మొదటి విడతలో 46,633 మందికి మాఫీ



రైతులకు రెండో విడత రుణమాఫీ చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రుణమాఫీ పథకం రెండో విడత ప్రక్రియను పూర్తి చేసింది. ముందుగా ప్రకటించినట్లుగానే మంగళవారం రూ.1.50 లక్షల వరకు రుణం పొందిన రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించగానే వికారాబాద్ కలెక్టరేట్‌లో పలువురు రైతులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ చెక్కులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్, బ్యాంకు అధికారులు ఈ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను అధికారులు, రైతులు వీక్షించారు. రుణమాఫీ విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురి కావాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అమలవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 18న మొదటి విడత రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. మొదటి, రెండో విడత ప్రక్రియ పూర్తి కాగా చివరి విడతలో రూ.2లక్షల రుణాల మాఫీ కోసం అన్నదాతలు ఎదురు చేస్తున్నారు.

40 శాతం మందికి లబ్ధి

జిల్లాలో 5.90 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 2.50 లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా సగటున 1.7లక్షల నుంచి 1.8లక్షల మంది రైతులు ఆయా బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు పొందుతున్నారు. బ్యాంకర్లు ఎకరా సాగు భూమికి సగటున రూ. 30వేల చొప్పున పంట రుణాలు ఇస్తే రూ.1,700 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని రకాల వాణిజ్య పంటలకు ఎకరానికి రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రతి ఏటా రూ.3,500 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అయితే రూ.1,800 కోట్ల వరకు మాత్రమే రుణాలు ఇస్తున్నారు. రుణమాఫీకి రైతులు కాకుండా రైతు కుటుంబాలు అనే నిబంధన పెట్టడంతో మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలు మాఫీ అయ్యాయి. 46,633 మంది రైతులకు రూ. 256.26 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. రెండో విడతలో రూ.1.5 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేశారు. 26,438 మంది రైతులకు రూ. 262.64 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. రెండు విడతల్లో 73,071 మంది రైతుల ఖాతాల్లో రూ.518.9 కోట్లు జమ చేశారు. ఇప్పటి వరకు 40 శాతం మంది రైతులు లబ్ధి పొందారు.

కటాఫ్ డేట్ తరువాత..

రుణమాఫీకి సంబంధించి రైతుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్ తరువాత పంట రుణాలకు అయిన వడ్డీ చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని మెలిక పెడుతున్నారు. అంతేకాకుండా రూ.2 లక్షల పైన రుణాలు తీసుకున్న రైతులు ఆపై మొత్తం చెల్లిస్తేనే పథకం వర్తిస్తుందని బ్యాంకర్లు అంటున్నారు. రుణమాఫీపై ఎలాంటి సందేహాలు ఉన్నా రైతు వేదికల్లో అధికారులను కలిసి నివృత్తి చేసుకోవాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. కానీ అక్కడ కూడా అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన రైతులకు కూడా వివిధ కారణాల వల్ల పథకం అమలు కావడం లేదు. ఆధార్, ఇతర సాంకేతిక కారణాల వల్ల చాలా మంది రైతులు రుణమాఫీ పొందలేకపోతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే..

అసెంబ్లీలో మాట్లాడుతున్నా

- బడ్జెట్‌ను అన్నివర్గాలు ఆమోదించాయి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: రాష్ట్ర బడ్జెట్‌ను అన్ని వర్గాల ప్రజలు ఆమోదించారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆయన 20 నిమిషాల పాటు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రగతికి, సంక్షేమానికి పెద్ద పీట అన్నారు. తనకు పౌరసరఫరాల శాఖపై మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మన ప్రభుత్వం రైతులకు రూ.31వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. దీంతో రైతులకు ఆర్థిక భారం తగ్గిందని పేర్కొన్నారు. సివిల్ సప్లయ్‌లో మునుపెన్నడూ లేని విధంగా మార్పు వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో పట్టాలు తప్పిన పౌరసరఫరాల శాఖను గాడిలో పెట్టడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో వరి ధాన్యం కొనుగోలులో సరైన పద్ధతి పాటించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వలేదని, ధాన్యం తరలించడానికి లారీలను అందుబాటులో ఉంచలేదని ఆరోపించారు. వికారాబాద్ జిల్లాలో సేకరించిన ధాన్యాన్ని కరీంనగర్‌కు తరలించడం వల్ల అక్కడి మిల్లర్లు మోసం చేశారని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రేషన్ కార్డులు పంపిణీ చేయలేదని ఆరోపించారు. త్వరలో మా ప్రభుత్వం కార్డులను పంపిణీ చేస్తుందని స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు అయిన కోట్‌పల్లి ప్రాజెక్టు కింద 9,400 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. గత ప్రభుత్వం తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో ప్రాజెక్టు అభివృద్ధి కోసం డీపీఆర్ సిద్ధం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. జుంటిపల్లి ప్రాజెక్టు అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర స్థాయి అధికారులతో ప్రాజెక్టును సందర్శించారన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.16కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. యాలాల మండలంలో శివసాగర్ ప్రాజెక్టుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ శంకుస్థాపన చేశారని, సగం పనులు పూర్తయినా గత సర్కారు పట్టించుకోలేదని ఆరోపించారు. తాండూరు ప్రజల ఆశీర్వాదంతోనే తనకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు.

రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

అనంతగిరి: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డీఈఈ సెట్ – 2024లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఆగస్టు 1నుంచి 6వ తేదీ వరకు వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో పరిశీలించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో అడ్మిషన్ల కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకరావాలని సూచించారు. ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ మెమో, 4 – 12 వరకు స్టడీ సర్టిఫికెట్, కులం, ఆదాయం తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

న్యూస్‌రీల్

యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్‌గా కృష్ణంరాజు



సీఎం రేవంత్‌రెడ్డితో కృష్ణంరాజు

కొడంగల్: యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్‌గా కొడంగల్ పట్టణానికి చెందిన కృష్ణంరాజు నియమితులయ్యారు. ఈయన ఇంత వరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. పార్టీ అధిష్టానం జాతీయ సమన్వయ కర్తగా నియమించింది. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

పద్మనాభుడి సేవలో చాగంటి దంపతులు



అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టపై వెలిసిన పద్మనాభ స్వామిని మంగళవారం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వీరికి సాదర స్వాగతం పలికి.. స్వామివారి మహత్యం, ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం స్వామివారికి అర్చన చేసి.. తీర్థప్రసాదాలు అందజేశారు. చాగంటి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పద్మనాభ స్వామి దర్శనం కలగడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన ప్రవచనాల ద్వారా అనంతగిరి విశిష్టతను, స్వామివారి మహిమలను భక్తులకు వివరిస్తానని తెలిపారు. ఆయన వెంట ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈఓ నరేందర్ తదతరులు ఉన్నారు.

1న స్పాట్ కౌన్సెలింగ్

కుల్కచర్ల: బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగారాం నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

చదువుకు మించిన ఆయుధం లేదు

కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట: చదువుకు మించిన ఆయుధం ఏదీ లేదని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అక్షర చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 2023 – 24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించి, ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ పెంచుకోవాలని సూచించారు. సమాజంలో మార్పు రావాలంటే చదువుతోనే సాధ్యమని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రపంచంలోని మంచి చెడులను తెలుసుకొని సన్మార్గంలో నడవడానికి చదువు ఎంతో దోహదపడుతుందన్నారు. ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. గ్రామస్థాయి నుంచే విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అక్షర చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారన్నారు. అనంతరం 18 మంది బాల, బాలికలకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో తహసీల్దార్ జయరాం, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జ్ భీంభరత్, కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, డైరక్టర్లు శ్రీధర్‌రెడ్డి, రంగారెడ్డి, రాంరెడ్డి, నాగిరెడ్డి భీంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రశాంత్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



‘కోట్‌పల్లి’కి వరద ప్రవాహం

- 12 అడుగులకు చేరిన నీటి మట్టం
- ఆనందంలో ఆయకట్టు రైతులు

జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టులోకి మంగళవారం నాటికి 12 అడుగుల నీరు చేరింది. ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీటి ప్రవాహం పెరుగుతూ వస్తోంది. ఈ సంవత్సరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ చేరడంతో రైతులు ఆందోళన చెందారు. నెల రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలకు వాగులు ప్రవహిస్తూ ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 24 అడుగులు కాగా 12 అడుగుల మేర నీరు వచ్చింది. గత ఏడాది జూలై 25వ తేదీ నాటికి ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పారింది. భారీ వర్షాలు పడితే ఆగస్టులో ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని ఇరిగేషన్ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్‌ఈ సుందర్ తెలిపారు.

– ధారూరు

దడపుట్టిస్తున్న డయేరియా

- నెల రోజుల్లో 602 కేసులు
- తాండూరు జిల్లా ఆస్పత్రికి రోగుల క్యూ
- పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి
- అప్రమత్తం కాని జిల్లా యంత్రాంగం

తాండూరు: నియోజకవర్గంలో డయేరియా వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గడిచిన నెల రోజుల్లో తాండూరు జిల్లా ఆస్పత్రిలో 602 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వానాకాలం ప్రారంభమైంది మొదలు నియోజకవర్గంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూలై చివరి వరకు దాదాపు 3,028మంది డయేరియా బారిన పడి చికిత్స పొందారు. జూన్ నెలలో 592 కేసులు నమోదు కాగా, జూలై మాసంలో 602 కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి రోజూ 20నుంచి 30కి పైగా కేసులు నమోదవుతున్నాయి.

అధికారుల సమన్వయ లోపం

వర్షాలు పడుతున్నా అధికారులు తాగునీటి ట్యాంకులు, బోరు బావులను క్లోరినేషన్ చేయడం లేదు. దీనికి తోడు వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా మరమ్మతులు చేయడం లేదు. దీంతో కలుషిత నీటినే తాగాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. సీజనల్ వ్యాధులపై అధికారులు ప్రజలు అవగాహన కల్పించడం లేదు.



తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు


భగీరథ పైప్‌లైన్‌లో వానపాములు

మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో వానపాములు వస్తున్నాయి. తాండూరు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి సరఫరా అవుతున్న నీటిలో వారం రోజులుగా వానపాములు వస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పలు గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్‌లో తోక పురుగులు వస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచులు లేకపోవడంతో..

ఈ ఏడాది జనవరితో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. నాటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన అందుబాటులోకి వచ్చింది. మరోవైపు గ్రామ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. కొత్తగా విధుల్లో చేరిన గ్రామ కార్యదర్శులకు అవగహన లేకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో భారీగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. వర్షాలు పడుతున్నందున ప్రజలు కాచి వడబోసిన నీటినే తాగాలి. వైరల్ కేసులను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది అవగహన కల్పిస్తున్నారు. బయట తయారు చేసిన పదార్థాలు తినడం. వేడిగా లేని పదార్థాలను తినడం, కలుషిత నీటిని తాగడం వలన డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ పల్వాన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

ప్రైవేటు స్కూల్ విద్యార్థులకు తప్పిన ముప్పు

- అదుపు తప్పి బోల్తా పడిన బస్సు
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- నీళ్లపల్లి సమీపంలో ఘటన



రోడ్డు పక్కకు ఒరిగిన స్కూల్ బస్సు

బషీరాబాద్: విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండలంలోని నీళ్లపల్లి సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు పట్టణంలోని గౌతమి మోడల్ స్కూల్‌కు చెందిన బస్సు ఉదయం నీళ్లపల్లి, జలాల్‌పూర్ గ్రామాల నుంచి 12 మంది విద్యార్థులతో తాండూరుకు బయలుదేరింది. కొంత దూరం వెళ్లాక నీళ్లపల్లి సమీపంలోని మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ నగేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. పిల్లలకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పిల్లలను వెంట తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న స్కూల్ యాజమాన్యం మరో బస్సును పంపినా తల్లిదండ్రులు వారి పిల్లలను స్కూల్‌కు పంపలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని బషీరాబాద్ ఎస్‌ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

పదోన్నతుల ఘనత పీఆర్టీయూదే

జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్



సభ్యత్వం అందజేస్తున్న అమర్‌నాథ్

పూడూరు: పెండింగ్ బిల్లులు చెల్లించి పీఆర్‌సీ ఫిట్‌మెంట్ ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తి, అంగడిచిట్టంపల్లి, మేడిపల్లికలాన్, మన్నెగూడ, పెద్ద ఉమ్మెంతాల్ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1800 మంది ఉపాధ్యాయులకు అదనంగా పదోన్నతులు కల్పించిన ఘనత తమ సంఘానికే దక్కిందన్నారు. పదివేల పీఎస్ హెచ్‌ఎంల పోస్టులను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పెద్దేముల్: మండల పరిధిలోని కందనెల్లి ప్రభుత్వ పాఠశాలలో సాయి కాలేజ్ ఆఫ్ డెంటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 220 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు పలు జాగ్రత్తలను వివరించారు. సమస్య ఎక్కువగా ఉన్నవారిని వికారాబాద్ డెంటల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్లు షరీఫ్, శ్రేయ, శ్వేత, శివాని, శ్రీలేఖ, అమూల్య, భవాని, పీఆర్‌టీ రవీందర్‌గౌడ్, అలివేలు, యూసుఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు అందజేస్తాం

ఎంపీడీఓ జర్నప్ప

పెద్దేముల్: తోటల పెంపకానికి పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకున్న రైతులకు త్వరలో మొక్కలు పంపిణీ చేస్తామని పెద్దేముల్ ఎంపీడీఓ జర్నప్ప అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని 14 గ్రామాల నుంచి 28 మంది రైతులు తోటల పెంపునకు ముందుకు వచ్చారన్నారు. ఆయిల్ పాం సాగుకు ఐదుగురు రైతులు దరఖాస్తు చేశారని వెల్లడించారు. 54 ఎకరాలల్లో పండ్ల తోటల పెంపకానికి రైతులు ఆసక్తి చుపుతున్నారని వివరించారు. ఇప్పటికే ఆయా రైతుల భూముల్లో ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించాలని సంబంధిత గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లకు సమాచారం ఇచ్చామన్నారు. పూర్తి స్థాయిలో మొక్కలు రక్షిస్తేనే డబ్బులు అందుతాయని చెప్పారు.

గుడి గంటల దొంగకు రిమాండ్

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో ని దేవాలయాల్లో గుడి గంటల చోరీకి పాల్పడిన దొంగను యాచారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రానికి చెందిన బండారి దుర్గప్రసాద్ మంగళవారం గునుగల్ గేట్ వద్ద అనుమానంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో దుర్గప్రసాద్ రంగారెడ్డి జిల్లాలోని యాచారం పీఎస్, చౌటుప్పల్, మర్రిగూడ పీఎస్ పరిధిలోని పలు దేవాలయాల్లోని గుడి గంటలను చోరీకి పాల్పడినట్లు చెప్పారు. చోరీ చేసిన గంటలను స్వాధీనం చేసుకుని దుర్గప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు.

రుణమాఫీ.. కొందరు అన్ హ్యాపీ!

ఓ వైపు రైతు రుణమాఫీ సంబురాలు జరుగుతుండగా.. మరో వైపు బకాయి తీరని రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష లోపు రుణమున్నా రెండో విడతలోనూ కాకపోవడంతో పలువురు బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

రెండో విడతలోనూ తీరని బకాయి

- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



రెన్యూవల్ చేసిన రశీదులు



బాధితుల ఆధార్ కార్డులు

దుద్యాల్: రాష్ట్రమంతా రుణమాఫీ ప్రకటించిన ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే పలువురు రైతులకు మాఫీ కాకపోడంతో కన్నీరు పెడుతున్నారు. మొదటి విడతలోనే రుణమాఫీ కాకపోవడంతో వారు ఇప్పటికే వ్యవసాయాధికారులు తమ సమస్యను వివరించి దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంక్ అధికారులను అడిగితే సమాధానమే కరువైంది. అర్హత ఉన్నప్పటికీ క్రాప్‌లోన్ మాఫీ కానీ రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండో విడతలోనూ నో డేటా

దుద్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన ఎరుకలి మల్లమ్మ, ఎరుకలి ఆశన్న దంపతులు వీరు తీసుకున్న పంట రుణానికి 2020 జూలై 23న రెన్యూవల్ చేయించారు. దీంతో బ్యాంక్ అధికారులు మల్లమ్మ అకౌంట్లో రూ.25వేలు, ఆశన్న ఖాతాలో రూ.56,500 పంట రుణం జమా చేశారు. అనంతరం మల్లమ్మ మరణించింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ చేయడంతో వారిది అయిందనుకున్నారు. వారి ఫోన్‌లకు ఎటువంటి మెసేజ్ రాకపోవడంతో బ్యాంకులో వివరాలు ఆరా తీయగా మాఫీ కాలేదంటూ బ్యాంక్ అధికారులు సమాచారమిచ్చారు. దీంతో వారు వ్యవసాయాధికారులను సంప్రదించారు. వెబ్‌సైట్‌లో పరిశీలిచండగా నో డేటా ఫౌండ్ వచ్చింది. బ్యాంకర్లకు పంపిన లిస్టులోనూ పేరు రాక ఖంగుతిన్నారు. దీంతో బాధితులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం విడుదల చేసిన రెండో విడతలోనూ మాఫీ కాలేదు. దీంతో బాధిత రైతులు తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వచ్చిన డేటానే ఉంటుంది

రుణాలు మాఫీ కాలేదని హస్నాబాద్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌ను సంప్రదించగా మాఫీకి బ్యాంకుకు సంబంధం ఉండదన్నారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన డేటా మాత్రమే ఉంటుందని.. వారికి మాత్రమే మాఫీ వర్తిస్తుందని సమాధానమిచ్చారు. దీంతో చేసేదేమీ లేక వారు వెనుదిరిగారు.

మాఫీ చేయాలి



పంట రుణాల మాఫీలో తమకు అన్యాయం చేయడం తగదు. ఇద్దరివి కలుపుకొని రూలక్ష లోపే అప్పుంది. వ్యవసాయాధికారులను అడిగితే బ్యాంకర్లు డేటా పంపించలేదన్నారు. బ్యాంక్ అధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటున్నారు.

– ఎరుకలి పెద్ద ఆశన్న, బాధితుడు, హస్నాబాద్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



రుణమాఫీ కొంతమంది రైతులకు నిలిచిపోయింది. ఇప్పటికే రూ.లక్షలోపు రుణమాఫీ కాని రైతుల దరఖాస్తులు స్వీకరించాం. ప్రస్తుతం రూ.1.50లక్షల లోపు మాఫీ కానీ వారి దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఈ దరఖాస్తులను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. మాఫీ కాని వారందరిపీ మరో దఫాలో చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.

– శంకర్ రాథోడ్, ఏడీఏ, కొడంగల్

చట్టం ముందు అందరూ సమానులే

అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం



అవగాహన కల్పిస్తున్న వీరానందం

యాలాల: ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టం దృష్టిలో అందరూ సమానులేనన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. చట్టంపై అవగాహన ఉంటేనే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛ, సమానత్వ భావనతో మెలగాలన్నారు. అంటరానితనం నిర్మూలన, బాల కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ యాదయ్యగౌడ్, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి



వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కొడంగల్: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పలువురు పార్టీ నాయకులు కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. గత ప్రభుత్వం ఉప్పరిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను మూసేసిందని ఆ పాఠశాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. కోస్గి బస్సు డిపోలో పాత బస్సులతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని నూతన బస్సులు వేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇందనూర్ బషీర్, మహమూద్, శ్యాంసుందర్, రాజు, రహీం, లక్ష్మప్ప, చౌడాపూర్ శ్రీనివాస్, అంగడిరాయిచూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్ కుమార్



మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

అనంతగిరి: మానవ అక్రమ రవాణా నేరమని అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్ అన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో అంకిత స్వచ్ఛంద సంస్థ మానవ అక్రమ రవాణా యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌కుమార్ మాట్లాడుతూ.. అక్రమ రవాణా చేసినా.. అందుకు సహకరించిన వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. వ్యక్తులను బెదిరించి బలవంతంగా పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులతో పనిచేయిస్తున్నట్లు గుర్తిస్తే 1098కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఏఎస్‌ఐ రాంచందర్, హెడ్ కానిస్టేబుల్ అలీముద్దీన్, హెచ్‌ఎం వెంకటేశం, అంకిత సంస్థ కో ఆర్డినేటర్ సంజీవ రావు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా రవిశంకర్



తాండూరు: ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్.దర్మిది రవిశంకర్‌ను నియమిస్తూ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన కేవీఎస్ మూర్తి జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి బదిలీ అయ్యారు. గతంలో డాక్టర్ రవిశంకర్ జిల్లా ఆస్పత్రి నుంచి బషీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి బదిలీపై వెళ్లారు. గతంలో సూపరింటెండెంట్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఆయన్ను డిప్యూటేషన్‌పై తాండూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి పోస్టింగ్ ఇచ్చారు. దీంతో మంగళవారం ఆయన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.

ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయం తప్పనిసరి

పర్యావరణవేత్త కవుల సరస్వతి

యాచారం: ఫార్మాసిటీని రద్దు చేస్తున్నామని ప్రకటనలే తప్పా సర్కారు నుంచి స్పష్టమైన గెజిట్ విడుదల కాలేదని పర్యావరణ వేత్త కవుల సరస్వతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఎవైనా కొత్త ప్రాజెక్టులు పెట్టాల్సి వస్తే నిబంధనల ప్రకారం సర్కారు మళ్లీ ప్రజల ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని అన్నారు. అదే విధంగా ఏర్పాటు చేసే పరిశ్రమలు, ప్రాజెక్టులపై పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ సర్కారు చేసిన తప్పులే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆమె అన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



స్టేషన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



తాండూరు: టౌన్ పీఎస్ ఎదుట..

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప

యాలాల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప అన్నారు. పంచాయతీ కార్మికుల డిమాండ్ల సాధనకు మంగళవారం నగరంలో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా నాయకులను, కార్మికులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బుగ్గప్ప మాట్లాడుతూ.. న్యాయపరమైన పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమా ండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ధర్నాలో పాల్గొనకుండా కార్మికులను హక్కులను కాలరాసే చర్యలను ఖండిస్తున్నామన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా కార్మికుల వేతనాలను రూ.26 వేలు చేయాలన్నారు. గత ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులను పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు షబ్బీర్, మొగులయ్య, లచ్చప్ప, రమేశ్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

తాండూరులో..

తాండూరు: ఔట్ సోర్సింగ్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ కార్మిక సంఘం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న కార్మిక సంఘం నాయకులను తాండూరు పట్టణ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట కార్మిక సంఘం జెండాలతో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల కోసం ఏఐటీయూసీ ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్‌లను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు కోరారు.

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్టు

శంషాబాద్ రూరల్: మండలంలోని మదన్‌పల్లిలో అరుణ్‌కుమార్‌కు చెందిన ఫాంహౌజ్‌లో సోమవారం రాత్రి కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఫాంహౌజ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న రాంచందర్‌రాజు, స్వామి, రమేష్, దశరథ, రాజు, హన్మంతు, నందం, సత్యంను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ 8 మంది నుంచి రూ.1,20,250 నగదును స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు మేలు

డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ



రైతుకు మిఠాయి తినిపిస్తున్న లాల్‌కృష్ణ

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు మేలు చేకూరుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. మంగళవారం రెండో విడత రుణమాఫీ సందర్భంగా జాఫర్‌పల్లిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రైతులకు మిఠాయి తినిపించి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు మాఫీ ప్రక్రియ చేపట్టారన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

50 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు, పరారీలో ముగ్గురు

- జల్సాలకు అలవాటుపడి దందా సాగిస్తున్న వైనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. వారి నుంచి 50.4 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆమె వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడి గ్రామానికి చెందిన చదలవాడ అనిల్, ఏపీలోని అనకాపల్లి జిల్లా కూసర్లపూడి మండలం రోలుగుంట గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి వెంకటలక్ష్మి ఇద్దరు కలిసి ఒడిశా రాష్ట్రానికి చెందిన పట్నాయక్ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. ఇదే క్రమంలో సోమవారం మధ్యాహ్నం శ్రీశైలం జాతీయ రహదారి సరస్వతిగూడ గేటువద్ద అనిల్, వెంకటలక్ష్మిలు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు అదుపులోని తీసుకొని వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో సుమారు రూ.13 లక్షల విలువ చేసే 50.4 కిలోల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు, జియో వైఫై డాంగిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనిల్ తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ప్యాకెట్లలో నింపి ఆంధ్ర నుంచి తెలంగాణ, మహారాష్ట్రాల్లో అధిక ధరకు విక్రయిస్తుంటారు. దీనికి కారణమైన మరో ముగ్గురు నిందితులు సిరిబాబు, నాగ్, పట్నాయక్ పరారీలో ఉన్నారు. అక్రమ సంపాదన, జల్సాలకు అలవాటు పడి గంజాయి దందా చేస్తున్నారన్నారు. పట్టుబడిన వారిలో అనిల్‌పై కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో నకిలీ కరెన్సీ, చీటింగ్ కేసులు నమోదయ్యాయి. యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి ఆరోగ్యాలు పాడు చేసుకోవద్దని డీసీపీ సూచించారు. నిందితులను పట్టుకున్న పోలీసులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, రవీందర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కొందుర్గు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంజాయి తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం ఉదయం కొందుర్గు శివారులోని ఇంక్రిడబుల్ ఇండియా వెంచర్‌కు వెళ్లే దారి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. షాద్‌నగర్ నుంచి కొందుర్గు వైపు వెళుతున్న స్కూటీలో ఐదు ప్యాకెట్ల గంజాయి పట్టుబడింది. దాదాపు 155.98 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న దన్వాడకు చెందిన భానుప్రకాష్, నారాయణపేటకు చెందిన సాయిప్రకాష్‌రెడ్డిని అదుపులోని తీసుకొని స్కూటీని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

గంజాయి సేవిస్తున్న యువకుడి అరెస్ట్



ఎక్సైజ్ పోలీసుల అదుపులో వినోద్‌నాయక్

అనంతగిరి: విహారయాత్రకు వచ్చిన ఓ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన మంగళవారం వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ రాఘవీణ తెలిపిన ప్రకారం.. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో గంజాయి కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని.. ఈ క్రమంలో పట్టణంలోని ఓ హోటల్ పరిసర ప్రాంతాల్లో వినోద్ నాయక్ అనే యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా తమ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ క్రమంలో యువకుడి వద్ద 62 గ్రాముల గంజాయి లభించింది. సికింద్రాబాద్‌కు చెందిన ఈ యువకుడు ఓ ప్రముఖ తెలుగు ఛానెల్‌లో డ్యాన్స్ ప్రోగ్రాంకు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈ దాడిలో ఎక్సైజ్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్రికెట్ ఆడుతుండగా ఘర్షణ

బ్యాట్‌తో కొట్టిన యువకుడు

ఇబ్రహీంపట్నం రూరల్: క్రికెట్ ఆడుతుండగా తలెత్తిన ఘర్షణ కారణంగా బ్యాట్‌తో ఓ యువకుడిపై దాడి చేసిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం రాజీవ్ గృహకల్పకు చెందిన సేనావత్ చరణ్ తన స్నేహితులు కోటేష్, నాగరాజు, చింటూలతో కలిసి కాలనీ చివర్లో క్రికెట్ ఆడుతున్నారు. అదే కాలనీకి చెందిన సోఫియాన్ ఆడుకోవడానికి అక్కడికి వచ్చాడు. ఆ కారణంగా గొడవపడి సోఫియాన్ బ్యాట్‌తో చరణ్‌పై దాడి చేశాడు. ఈ విషయాన్ని సోఫియాన్ సోదరుడు సోహెల్‌కు చరణ్ తెలిపాడు. దీంతో సోదరున్ని సోహెల్ ఇంటి దగ్గర మందలించాడు. అదే సమయంలో సోఫియాన్, అతని సోదరులు సోహెల్, సామిల్ గొడవ పడ్డారు. ఆ క్రమంలో కాలనీకి చెందిన కరీం వారిని ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో సోఫియాన్ తండ్రి ఎవరి కోసమో మీరు గొడవపడడం ఎందుకని, దీనికి కారణమైన చరణ్‌ను చంపేస్తానని కత్తితో బెదిరించాడు. ఈ మేరకు పోలీసులు ఇరువురిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

జావెలిన్ త్రోలో విద్యార్థి సత్తా



రాజేశ్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు యాదగిరి

అబ్దుల్లాపూర్‌మెట్: సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని బాటసింగారం జెడ్పీ పాఠశాల విద్యార్థి సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రమావత్ రాజేశ్ జావెలిన్‌త్రో 16 సంవత్సరాల బాలుర విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. ఆగస్టు 7న జరిగే మూడో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు మల్యాల యాదగిరి తెలిపారు. బంగారు పతకం సాధించిన రాజేశ్‌ను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించి అభినందించారు. అంకితభావంతో కఠోర సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు రాణించాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు, పాఠశాల అమ్మ ఆదర్శ చైర్మన్, తల్లిదండ్రులు, గ్రామస్తులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు రాజేశ్‌ను అభినందించారు.